7
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 21 । మార్చి । 2023



అటవీ సంరక్షణ అందరి బాధ్యత
అడవులను నరుకుతూ పోతే జీవరాశుల మనుగడకు ప్రమాదం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ సంరక్షణ అందరి బాధ్యత. 8లో



ఏజెన్సీలో భారీ వర్షం
బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో వడగళ్లు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. 8లో



గంజాయి స్వాధీనం
గంజాయి రవాణా చేస్తూ విక్రయిస్తున్న నేరంపై ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మూడు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో

అక్కచెల్లెమ్మలకు ఆసరా

ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా..
- వైఎస్సార్ ఆసరాతో మహిళా సాధికారత
- జిల్లాలో 3.55 లక్షల మందికి రూ.328.34 కోట్ల మేర లబ్ధి
- ఈనెల 25న మూడో విడత నగదు జమ
- దెందులూరులో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- ముమ్మరంగా ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, ఏలూరు : '2019 నాటికి డ్వాక్రా సంఘాలపై ఉన్న రుణ నిల్వలన్నీ నాలుగు వాయిదాల్లో ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తుంది. ప్రతి అక్కకు, చెల్లికి లబ్ధి చేకూర్చాలని వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభిస్తాం. ప్రతి డ్వాక్రా సంఘానికి ఎన్నికల ముందు ఉన్న బకాయిని నాలుగేళ్ల కాలవ్యవధిలో నాలుగు విడతల్లో ప్రభుత్వమే చెల్లించి వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తుంది' అని ప్రతిపక్ష నేత హోదాలో ప్రజాసంకల్ప పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని ఏటా నగదు జమ చేస్తున్నారు. ఈనెల 25న మూడో విడత నగదు జమ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి ఏలూరు జిల్లాలోని దెందులూరు వేదిక కానుంది.

చురుగ్గా పనులు
వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమం ఈనెల 25న దెందులూరులో సీఎం జగన్ చేతులమీదుగా ప్రారంభం కానుంది. ముందుగా బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించిన అనంతరం బటన్ నొక్కి నేరుగా మహిళా సంఘాలకు నగదు జమ చేయనున్నారు. సీఎం పర్యటన జిల్లాలో ఖరారైన క్రమంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. దెందులూరులో హెలీప్యాడ్ నుంచి సీఎం చేరుకుని అక్కడ నుంచి దెందులూరులోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని సభా ప్రాంగణానికి వచ్చి ఆసరా మూడో విడత రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మూడో విడత నగదు జమ కార్యక్రమం ద్వారా ఏలూరు జిల్లాలోని 35,748 డ్వాక్రా గ్రూపుల్లోని 3,55,315 మంది మహిళలకు రూ.328.34 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొదటి, రెండు విడతల్లో నగదు జమ పూర్తయింది. ఇప్పుడు మూడో విడత పూర్తిచేసి వచ్చే ఏడాది నాల్గో విడత సాయం అందించి పూర్తి రుణమాఫీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

మొత్తంగా రూ.2,770 కోట్ల రుణమాఫీ
2019 ఏప్రిల్ 11 నాటికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 63,775 డ్వాక్రా సంఘాల్లోని సుమారు 6.50 లక్షల మంది మహిళలకు రూ.2,770 కోట్ల రుణ బకాయిలున్నాయి. వీటన్నింటినీ మాఫీ చేస్తామని పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి, దానికనుగుణంగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా పేరుతో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మొదటి ఏడాది ఉమ్మడి జిల్లాలోని 63,775 గ్రూపుల్లోని 6,34,934 మంది మహిళలకు రూ.689.89 కోట్ల మేర నగదు అందించారు. అలాగే రెండో విడతలో 63,861 గ్రూపుల్లోని 6,35,871 మంది మహిళలకు రూ.693.61 కోట్లు జమ చేశారు.

35,748 సంఘాలు.. 3.55 లక్షల మంది సభ్యులు
మూడో విడతలో భాగంగా ఏలూరు జిల్లాలోని 35,748 డ్వాక్రా సంఘాల్లో 3,55,315 మంది మహిళలకు రూ.328.34 కోట్ల మేర నగదు జమ కానుంది. నియోజకవర్గాల వారీగా చింతలపూడిలో 59,279 మందికి రూ.66.44 కోట్లు, దెందులూరులో 53,354 మందికి రూ.53.66 కోట్లు, ఏలూరులో 11,334 మందికి రూ.8.91 కోట్లు, కైకలూరులో 52,932 మందికి రూ.46.69 కోట్లు, నూజివీడులో 53,189 మందికి రూ.46.76 కోట్లు, పోలవరంలో 59,172 మందికి రూ.44.15 కోట్లు, ఉంగుటూరులో 50,804 మందికి రూ.45.63 కోట్లు, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంలో 15,251 మందికి రూ.16.09 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

రూ.328.34 కోట్లు



ఇప్పటికే రెండు విడతల్లో మహిళలకు రుణ నిల్వను చెల్లించగా ఈ నెల 25న మూడో విడత కార్యక్రమం ద్వారా రూ.328.34 కోట్లు అందించనున్నాం. దీంతో 75 శాతం రుణ చెల్లింపు పూర్తవుతుంది. ముఖ్యమంత్రి చేతులమీదుగా దెందులూరులో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.
– కె.విజయరాజు, డీఆర్‌డీఏ పీడీ

ఇంటర్ పరీక్షలకు 95 శాతం హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సోమవారం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గణితం పేపర్-1ఏ, బోటనీ-1, సివిక్స్-1 పరీక్షలు జరిగాయి. 106 కేంద్రాల్లో 37,912 మంది విద్యార్థులకు 35,870 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 12,267 మంది జనరల్ విద్యార్థులకు 11,676 మంది, 2,074 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,742 మంది హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 16,502 మంది జనరల్ విద్యార్థులకు 15,891 మంది, 1,730 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,517 మంది హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 4,456 మంది జనరల్ విద్యార్థులకు 4,279 మంది, 883 ఒకేషనల్ విద్యార్థులకు 765 మంది హాజరయ్యారు. మొత్తంగా 95 శాతం హాజరు నమోదైంది. జంగారెడ్డిగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న జంగారెడ్డిగూడెం శబరి ఒకేషనల్ కళాశాలకు చెందిన విద్యార్థి మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డాడని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు తెలిపారు.

9న భగవద్గీత పోటీలు

భీమవరం (ప్రకాశం చౌక్): ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ అధ్వర్యంలో వచ్చేనెల 9న జిల్లాస్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలను నిర్వహిస్తామని ఉద్దరాజు కాశీ విశ్వనాథ్ రాజు తెలిపారు. ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల పోటీలను సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 94403 42699, 98491 33457 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

సత్వర పరిష్కారానికి చర్యలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం : స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి నిర్దేశిత గడువులోపు పరిష్కారం చూపాలని ఎస్పీ యు.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో 13 మంది నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. కట్నం వేధింపు కేసులు మూడు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు 9, ఇతర సమస్యలపై ఒక అర్జీ అందాయని, వీటిని త్వరితగతిని పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు.

పక్కాగా ఇంటర్ పరీక్షలు




పరీక్షా కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం: మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి ఆస్కారం లేకుండా ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా ముగిసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఆదిత్య స్కూల్‌లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల తీరును, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయన్నారు. పరీక్షలన్నీ ముగిసే వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఎక్కడా ఫిర్యాదు రాకుండా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహసీల్దార్ ఎండీ ఫాజిల్ ఉన్నారు.

'ఉపాధి' సిబ్బందికి శిక్షణ

ఉండి: ఉపాధి హామీ పథకం పనుల అంచనాల తయారీలో జాగ్రత్తలు తప్పనిసరి అని ఎన్ఆర్ఈజీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు వి.విజయలక్ష్మి, బి.వీరాస్వామి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జిల్లాస్థాయి ఉపాధి హామీ పనులపై టెక్నికల్ అసిస్టెంట్లు, బేర్‌ఫుట్ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లకు జిల్లా వాటర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీడీలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన సెక్యూర్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు.

22న అఖిల భారత టెన్నిస్ టోర్నమెంట్



వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

సాక్షి, భీమవరం: భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఈనెల 22 నుంచి ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు క్లబ్ కార్యదర్శులుపెన్మెత్స వెంకట రామరాజు, వీవీఎస్ సుబ్రహ్మణ్య వర్మ తెలిపారు. సోమవారం క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఐదు రోజులపాటు జరిగే టోర్నమెంట్‌ను బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తారని కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్యఅతిధిగా హాజరవుతారన్నారు. 35+ నుంచి 75+ వరకు కేటగిరీల్లో జరిగే పోటీల్లో పలు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటారని వారికి భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వేగేశ్న వెంకటరాయవర్మ సహకారంతో విజేతలకు నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. క్లబ్ సభ్యులు జె.సత్యనారాయణ, కె.రామకృష్ణంరాజు, ఎ.రాంబాబు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ప్రత్యేక బస్సులు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 29న ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాచలంలో 30న ఉదయం నుంచి తిరుగు ప్రయాణానికి బస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

విబ్రియో నివారణకు 'బయోఫేజ్-వి'



బయోఫేజ్-వి మందును విడుదల చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రొయ్యల చెరువుల్లో విబ్రియో సమస్యకు చక్కటి పరిష్కారానికి బయోమేడ్ సంస్థ తయారుచేసిన బయోఫేజ్-వి దోహదపడుతుందని ఆ సంస్థ ఎండీ పి.కృష్ణంరాజు తెలిపారు. సోమవారం బయోఫేజ్ మందును భీమవరంలో విడుదల చేసిన సందర్భంగా ఆక్వా రైతులు, మందుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రొయ్యలకు వ్యాపించే విబ్రియో సమస్యతో రైతులు సతమతమవుతున్నారని, దీనిని అధిగమించడానికి సంస్థ బయోఫేజ్-వి మందును తయారుచేసి తొలిసారిగా భీమవరంలో ఆవిష్కరించామన్నారు. ఫేజెస్ టెక్నాలజీతో తయారుచేసిన బయోఫేజ్-వి విబ్రియో సమస్యకు చక్కటి పరిష్కారమన్నారు. తెగుళ్ల నివారణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తమ సంస్థ రైతులకు మేలు చేసేలా మందులు తయారు చేస్తున్నట్టు చెప్పారు. శాప్ ప్రెసిడెంట్ ఎస్.కృష్ణ, టెక్నికల్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, జూనియర్ ఎండీ కార్తీక్, మార్కెటింగ్ హెడ్ బీడీఎం ఎం.లక్ష్మీనారాయణ, రొయ్యల రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

ఉగాది పద్య కవితల పోటీల విజేతలు వీరే..

తణుకు టౌన్: ఉగాది సందర్భంగా తణుకు నన్నయ భట్టారక పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్య కవితల పోటీల విజేతల వివరాలను పీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ సుబ్రహ్మణ్యం, కొల్లి రామచంద్రశర్మ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎం.ప్రకాశం పంతులు (గణపవరం), ధూళిపాళ ఆర్క సోమయాజీ, భాగవతుల లక్ష్మీనరసింహం (నరసాపురం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు. జిల్లాస్థాయిలో హైస్కూల్ విభాగంలో.. ఈ.సుజన ప్రకాశ్ (పెనుగొండ), ఆర్ఎస్ఎల్ మహేశ్వరి, ఎం.కార్తీక్ (తణుకు), 5,6,7 తరగతుల విభాగంలో.. ఆర్ఎస్ సర్వజ్ఞ, డి.దుర్గాభవాని (తణుకు), నవరం కీర్తిశ్రీ (చెరుకువాడ), వై.శివరంజని కె.ఉత్తిష్ఠ (తణుకు) విజేతలుగా నిలిచారన్నారు. వీరికి ఈనెల 22న రామకృష్ణ సేవా సమితి భవన్‌లో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందిస్తామన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం



భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్) : స్పందనలో అందిన ప్రతి దరఖాస్తునూ నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో 321 దరఖాస్తులు వచ్చాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఆర్డీఓ దాసి రాజు, డీసీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ
యువతకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆమె సమీక్షించారు. శిక్షణ కోసం 2,194 మంది యాప్‌లో నమోదు చేసుకున్నారని, యాప్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాలో ఏడు స్కిల్ డెవలప్‌మెంట్ హబ్స్, ఒక కళాశాల నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సిద్ధంగా ఉన్నాయని, మరో కళాశాల త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాల, ఆచంట ప్రభుత్వ ఐటీఐ, నరసాపురం డిజిటల్ కమ్యూనిటీ భవన్, తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాలలో శిక్షణ తరగతులు ప్రారంభించి వివిధ ట్రేడుల్లో 330 మందికి శిక్షణ ఇస్తున్నారన్నారు. భీమవరం, పాలకొల్లు, ఉండి, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు నియోజకవర్గాల్లో 1,200 మందికి శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా నిర్ణయించామన్నారు.


'ఉపాధి' పనులు గుర్తించాలి
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నూతన పనులు గుర్తించి అంచనాలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో రోజుకి 1,200 నుంచి 1,500 మంది వరకూ కూలీలకు పనులు కల్పించాలన్నారు. అమృత్ సరోవర్‌లో గుర్తించిన 80 చెరువుల పనులు త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. శనివారం పాఠశాలల్లో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలన్నారు.

కవితా లోకంలో కలికితురాళ్లు


- జిల్లా ఖ్యాతిని చాటిన కవులు
- నేడు ప్రపంచ కవితా దినోత్సవం



అడవి బాపిరాజు



వేల్చేరు నారాయణరావు



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అగ్గిపుల్ల.. సబ్బుబిళ్ల.. కాదేదీ కవితకనర్హం అన్నారు శ్రీశ్రీ.. రవికాంచని చోటు కవి కాంచును.. అని తెలుగునాట సామెత. కవిత్వం గొప్పతనాన్ని తెలియజేసే ఉపమానాలు ఎన్నో ఉన్నాయి. మనసులను కదిలించేది కవిత.. నిద్రాణమైన సమాజాన్ని జాగృతం చేసే సాహిత్యవస్తువు కవిత.. అంతటి ప్రాముఖ్యమున్న కవితాలోకంలో విశేష సేవ చేసిన కవులు, సాహిత్యకారులు ఎందరో గోదావరి జిల్లా మూలాలకు చెందిన వారు కావడం గర్వకారణం. తన రచనలతో ఎంకి-నాయుడు మామలను సృష్టించి తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న నండూరి సుబ్బారావు జిల్లాకు చెందిన వారే. రచయిత అడవి బాపిరాజు, సినీ దర్శకుడు, రచయిత దాసరి నారాయణరావు, రచయితలు బొడ్డు బాపిరాజు, సామవేదం జానకిరామశర్మ, బుచ్చిబాబు, భగవాన్, ప్రస్తుత కవుల్లో రసరాజు, భువనచంద్ర, అనంత శ్రీరామ్ ఇలా సాహితీలోకం కలికితురాళ్లుగా నిలుస్తున్న వారు ఎందరో ఉన్నారు. ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు సాధించిన వేల్చేరు నారాయణరావు జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకువెళ్లగా, ఆర్ఆర్ఆర్ సినిమా రచయిత విజయేంద్రప్రసాద్ అంతర్జాతీయ స్థాయిలో పేరు సంపాదించారు.

నిరంతరం ప్రభావితం



సాహిత్యం సమాజాన్ని, సమాజం సాహిత్యాన్ని నిరంతరం ప్రభావితం చేస్తూనే ఉంటాయి. గతంతో పోలిస్తే కవి బాధ్యత పెరిగింది. పూర్వం విశ్రాంతి వర్గాలకు మాత్రమే ఉద్దేశించిన కవిత్వం ఇప్పుడు అన్నివర్గాలను చైతన్యపరచాల్సిన బాధ్యత కలిగి ఉంది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో మార్పులను నిశితంగా పరిశీలించి ప్రగతిశీల దృష్టితో రచనలు చేయాలి.
– లంకా వెంకటేశ్వర్లు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు

అక్షరాలకు కదిలించే శక్తి



అక్షరాలకు మనిషిని, మనసుని కదిలించే శక్తి ఉంది. సమాజంలో చైతన్యం తెచ్చే శక్తిగా కవిత్వాన్ని చెప్పవచ్చు. సామాజిక సమస్యల చిత్రీకరణ, అనుభవాలు, అనుభూతుల కలయికతో కవిత్వం మనుగడలో ఉంది. సాహిత్యంపై యువతరానికి ఆసక్తి, అనురక్తి కలిగించడానికి కళాశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. పిల్లలను ప్రోత్సహించడానికి వారి రచనలతోనే మ్యాగజైన్ రూపొందిస్తున్నాను.
–సుంకర గోపాల్, కవి

సంస్కృతి నిర్మాణానికి..



జాతి తన చరిత్రను, నాగరికతను, సంస్కృతి, సంప్రదాయాలను పటిష్టంగా నిర్మించుకోవడానికి కవిత్వం మార్గదర్శనం చేయాలి. ప్రజలను, ప్రగతిని వెనక్కి నెట్టేస్తున్న దురాచారాలను సంస్కరించి ఉన్నతమైన భావాలు, విలువలు కలిగిన సమాజాన్ని ఏర్పాటు చేయడానికి సాహిత్య కార్మికులు నిరంతరం పనిచేయాలి. వైవిధ్యాలన్నింటినీ ప్రతిబింబించేలా కవిత్వం ఉండాలి.
– శ్రీ నాగాస్త్ర, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి

తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలి



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్‌ను కలిసిన తూర్పు కాపు సంఘ నాయకులు

సాక్షి, భీమవరం : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తుర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్‌కు తూర్పుకాపు సంఘం నాయకులు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తూర్పు కాపులు ఉపాధి నిమిత్తం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారని, అయితే విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉంటున్న వారికి మాత్రమే ఓబీసీ రిజర్వేషన్ సర్టిఫికెట్ ఇస్తున్నారన్నారు. వీరి మాదిరిగానే మిగిలిన జిల్లాల్లో తూర్పు కాపులకు కూడా ఓబీసీ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు. రాష్ట్ర కమిటీ తరపున జీవీఎల్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. తూర్పు కాపు సంఘ నాయకులు ఈజ్జవరపు మరిడయ్య, మజ్జి రాంబాబు, కొత్తకోటి ప్రసాద్, మెరగని ప్రసాద్, వాంజరపు దేవి ప్రసాద్, చేనమల గంగాధర్, చేనమల చంద్రశేఖర్, గొర్లి శ్రీనువాసనాయుడు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ వట్టి కన్నుమూత



వట్టి వెంకట రంగ పార్థసారథి (ఫైల్)

భీమడోలు: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల శాసనమండలి మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నేత వట్టి వెంకట రంగ పార్థసారథి (92) కన్నుమూశారు. విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురం గ్రామంలోని సొంత వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు జరిగాయి. పార్థసారథి చిన్న కుమారుడు, మాజీ మంత్రి వసంత కుమార్ గత జనవరిలో మృతిచెందగా ఆయన మానసికంగా కుంగిపోయారు. పార్థసారథి వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. డీసీసీబీ చైర్మన్‌గానూ వ్యవహరించారు.



జాతీయస్థాయిలో సత్తాచాటిన శిరీష

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

తాడేపల్లిగూడెం (టీఓసీ) : రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జరుగుతున్న జాతీయస్థాయి యోగాసన పోటీల్లో జిల్లా క్రీడాకారిణి టి.శిరీష ప్రతిభ కనబర్చింది. మాస్టర్స్ ఏ విభాగంలో మూడో స్థానంలో నిలిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. టీమ్ మేనేజర్‌గా కరిబండి రామకృష్ణ వ్యవహరిస్తున్నారు.

అటవీ సంరక్షణ.. అందరి బాధ్యత

- అడవుల పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక కృషి
- ఉమ్మడి జిల్లాలో 1.32 లక్షల హెక్టార్లలో అడవులు
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం



పశ్చిమ మన్యంలోని అటవీ ప్రాంతం

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతం పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది అడవులు. పొడవాటి చెట్లు, ఎత్తయిన కొండలు, ఆ కొండలపై పచ్చని చెట్లు ఆకట్టుకుంటాయి. అయితే అడవులు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. అడవుల సంరక్షణ కోసం ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు తగు చర్యలు చేపడుతున్నా స్మగ్లర్లు యథేచ్ఛగా అడవిలో చెట్లను నరికి అక్రమంగా కలప తరలించుకుపోతున్నారు. కలప అక్రమ రవాణా పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి స్మగ్లర్లను పట్టుకుని కేసులు పెట్టినా ఆగడం లేదు. ప్రతీ సంవత్సరం మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అడవులను నరుకుతూ పోతే జీవరాశుల మనుగడకు ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలి. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

జిల్లాలో 1.32 లక్షల హెక్టార్లలో అడవి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా అడవులు 1.32 లక్షల హెక్టార్లుగా ఉంది. 85 శాతం ఏజెన్సీ ప్రాంతంలోనే ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 48 మండలాల్లో 1,32,302 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం, కుక్కునూరు, పోలవరం, వేలేరుపాడు, జీలుగుమిల్లి ఐదు గిరిజన మండలాల్లో 1,12,445 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. బుట్టాయగూడెం మండలంలో 21,879 హెక్టార్లు, పోలవరం మండలంలో 27,927 హెక్టార్లు, జీలుగుమిల్లి మండలంలో 8,903, వేలేరుపాడు మండలంలో 29,476, కుక్కునూరు మండలంలో 22,259, టి.నర్సాపురం మండలంలో 4,384, చింతలపూడి మండలంలో 6,580, కామవరపుకోట మండలంలో 1,178, లింగపాలెం మండలంలో 2,119, గోపాలపురం మండలంలో 649, ద్వారకా తిరుమల మండలంలో 813, నల్లజర్ల మండలంలో 2,174, పెదవేగి మండలంలో 1,332, ఉంగుటూరు మండలంలో 1,226 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నట్లు అధికారులు చెపుతున్నారు. ఒకప్పుడు 23 శాతంగా ఉన్న అడవులు ప్రస్తుతం 22.02 శాతంగా ఉన్నాయి.

పర్యావరణ పరిరక్షణలో అడవులు కీలకం

వాతావరణంలోని కార్బన్‌డయాక్సైడ్, ఆక్సిజన్ సమతుల్యతను కాపాడడంలో అడవులు కీలకపాత్ర పోషిస్తాయి. ఉష్ణోగ్రతల్ని తగ్గించడంలో అడవులు సాయపడతాయి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టం ఎక్కువగా ఉండకుండా సాయపడతాయి. ఇలాంటి అడవులను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

చెట్లు నరికితే కఠిన శిక్షలు

అడవులను కాపాడుకుంటేనే రేపటి తరాలు ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో అడవిలో ఎవరైనా చెట్లను నరికితే కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు. అడవుల్లో ఉన్న ఇరుగుడు సేవ, టేకు వంటి విలువైన వృక్షాలను నరికిన వ్యక్తులను నేరుగా అరెస్ట్ చేసి ఫారెస్ట్ అధికారులు ఆ వ్యక్తిని కోర్టులో హాజరు పరుస్తారు. కోర్టులో నేరం రుజువైతే సుమారు 7 సంవత్సరాల జైలుశిక్ష పడే అవకాశం ఉందని ఫారెస్ట్ అధికారులు అంటున్నారు. చెట్టుకు వెలకట్టి దానిని 10 రెట్లు పెంచి జరిమానా విధించే అవకాశం ఉంటుంది. అభయారణ్యంలో చెట్లు నరికినా, వన్యప్రాణులను వేటాడినా కఠినమైన శిక్షలు ఉంటాయి.

మానవ మనుగడలో అడవుల పాత్ర కీలకం



మానవ మనుగడలో అడవుల పాత్ర ఎంతో కీలకమైనది. అడవులు భూమిపై ఉన్న అన్ని ప్రాణులకు అవసరం. అలాంటి అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ముఖ్యంగా ఫారెస్ట్ అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి అడవులను రక్షించాల్సి ఉంది.

తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం ఎమ్మెల్యే

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అడవి నరికివేతపై నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే అనేక మందిని పట్టుకుని కేసులు నమోదు చేశాం. అడవిలో ప్రవేశించకుండా అడవిచుట్టూ రక్షణ ఏర్పాటు చేస్తున్నాం. అదేవిధంగా అడవులు అంతరించిపోతే కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. దావీదురాజు నాయుడు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పోలవరం

వివాహిత ఆత్మహత్య

నూజివీడు: పట్టణంలోని ఢంఢం గార్డెన్ ప్రాంతానికి చెందిన వివాహిత బొర్రా హారిక ప్రియ(20) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై మృతురాలి తల్లి చలమాల ధనలక్ష్మి ఫిర్యాదు చేసింది. ఒకటో పట్టణ ఎస్సై కే.శివనారాయణ తెలిపిన వివరాల ప్రకారం హారికప్రియ కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. హారికప్రియకు తన ఆడబిడ్డ కొడుకైన బొర్రా సర్వేశ్వరరావుతో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరిద్దరికి ఏడాదిన్నర వయస్సున్న కుమారుడు కూడా ఉన్నాడు. సర్వేశ్వరరావు తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరి సోమవారం ఉదయం పనికి వెళ్లాడు. వర్షం వల్ల తిరిగి 10 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా హారికప్రియ దూలానికి ఉరివేసుకొని ఉంది. వెంటనే ఇంటిపక్కనే ఉండే వారిని పిలిచి తలుపు పగులగొట్టి హారికప్రియను కిందకు దించి స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. 11 గంటల సమయంలో ఆమె మృతిచెందింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం



జీలుగుమిల్లి మండలంలో కురిసిన వడగండ్ల వాన



జీలుగుమిల్లిలో ఆటోపై విరిగిపడిన చెట్టుకొమ్మ



బుట్టాయగూడెం మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న

దెబ్బతిన్న మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం కారణంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీ ప్రాంతంలో పలు పంటలు దెబ్బతిన్నాయి. సోమవారం మధ్యాహ్నం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో వడగళ్లు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటలకు పైగా వర్షం కురవడంతో రెండు మండలాల్లోని పొగాకు, మొక్కజొన్న, మిరప పంటలు దెబ్బతిన్నాయి. పలు చోట్ల తీగజాతి పంటలు పాడయ్యాయి. తీవ్రమైన ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. ప్రధాన రహదారుల వెంట పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. గ్రామస్తులు, పోలీసులు రోడ్లపై పడిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. జీలుగుమిల్లి సీటీఆర్‌ఐ క్వార్టర్స్ వెనుకవైపు ఒక ఆటోపై చెట్టు కొమ్మలు విరిగిపడడంతో ఆటో పైభాగం దెబ్బతింది.

3 కిలోల గంజాయి స్వాధీనం

జంగారెడ్డిగూడెం: గంజాయి రవాణా చేస్తూ విక్రయిస్తున్న నేరంపై ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.బాలసురేష్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమ జిల్లా కుంట తాలూకా దోంఢ్ర గ్రామానికి చెందిన వెట్టి దుర్గ అలియాస్ విక్రమ్ స్థానిక రజక పేటలోని ఎస్‌కే ఇలియాజ్ ఇంటికి 3 కేజీల గంజాయిని తీసుకువచ్చాడన్నారు. గంజాయి సేవించే అలవాటు ఉన్న ఇలియాజ్ అమ్మకాలు కూడా చేస్తున్నాడన్నారు. గరుడ పక్షి నగర్‌కు చెందిన ఆళ్ల రాజేష్ కూడా గంజాయిని సేవించడంతో పాటు అమ్మకాలు చేస్తున్నాడన్నారు. ఆదివారం ఎలియాజ్ ఇంటికి వెట్టి దుర్గ 3 కేజీల గంజాయిని తీసుకువచ్చాడని, అక్కడకు రాజేష్ కూడా వచ్చాడన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై ఎం.సాగర్‌బాబు ఇలియాజ్ ఇంటి వద్ద దాడి చేయగా, 3 కేజీల గంజాయితో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో సీఐ పి.బాలసురేష్ బాబు తదితరులు

కేంద్రంతో అమీతుమీ



సన్నాహక సభలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఏలూరు రూరల్: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం ఏలూరులో జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సన్నాహక సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణపై బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందన్నారు. ఎన్నో ఏళ్లగా పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్రం స్పందించకపోవడం దారుణం అన్నారు. వర్గీకరణ సాధిస్తేనే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి 58 ఉపకులాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి 13 జిల్లాల సమన్వయకర్తలు ముమ్మిడి చిన్న సుబ్బారావు, కందుల రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగలశేఖర్, కాశీకృష్ణ, గద్దల ప్రసాద్, నమ్మిన లక్ష్మీ, కూచిపూడి మహేష్, అయినపర్తి మాధవరావు, చాట్ల సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల హెల్ప్‌లైన్ పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం(ప్రకాశం చౌక్): జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ పోస్టర్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీరయ్య చౌదరి, జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ ఉభయగోదావరి జిల్లాల ఫీల్డ్ ఆఫీసర్ పుష్పాంజలి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులకు చేయూత నందించడం, అవసరమైనవారికి సహకారం అందించటం ఈ హెల్ప్ లైన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎవరైనా నిరాదరణకు గురైతే 14567కు ఫోన్ చేస్తే తక్షణం సంఘటనా స్థలానికి చేరుకుని వారి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. పెన్షన్, న్యాయ సలహాలపై సూచనలను సైతం అందిస్తామని అన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీరయ్య చౌదరి మాట్లాడుతూ అన్ని బస్సుల్లోనూ ఈ పోస్టర్లు అతికించి విస్తృత ప్రచారానికి తమ వంతు సహకరిస్తామని, నిరాదరణకు గురైన వృద్ధులకు అండగా నిలబడటం మనందరి బాధ్యత అని అన్నారు.



వృద్ధుల హెల్ప్‌లైన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

15 మంది జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లిలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.చంటిబాబు సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.11,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నెక్కలం గొల్లగూడెంలో, ఎస్.ఏ.పేట గ్రామాల్లో పేకాట, కోడిపందేలపై దాడులు నిర్వహించి 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎట్టకేలకు నిట్ విద్యార్థి ఆచూకీ లభ్యం

తాడేపల్లిగూడెం: నిట్‌లో తొలిఏడాది బీటెక్ చదువుతున్న ఉత్తరప్రదేశ్ గోరక్‌పూర్‌కు చెందిన విద్యార్థి సందీప్ శ్రీ వాత్సవ ఆచూకీ ఎట్టకేలకు తెలిసింది. సహచర విద్యార్థులతో వాగ్వివాదం కారణంగా రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయాడు. శనివారం సాయంత్రం విద్యార్థుల వివరాలు తీసుకొనే క్రమంలో శ్రీవాత్సవ లేనట్టు వార్డెన్ గుర్తించాడు. క్యాంపస్ అంతా చూసినా ఆచూకీ లభించలేదు. దీంతో అధికారుల సూచన మేరకు హాస్టల్ వార్డెన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిట్ దాటిన విద్యార్థి విజయవాడ నుంచి సంగమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో తమ స్వస్థలానికి సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు చేరినట్టు విద్యార్థి తండ్రి ధర్మేంద్ర నిట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఢిల్లీ సదస్సుకు ఉద్యాన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ ఆడిటోరియంలో 18, 19 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సుకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు హాజరయ్యారు. చిరు ధాన్యాలపై జరిగిన గ్లోబల్ సమిట్‌లో ఆఫ్రికా, ఆసియాలకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రులు, వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో చదువుకుంటున్న విద్యార్థులతో పాటు వర్సిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు సదస్సులో పాల్గొనే అవకాశం దక్కింది. వర్సిటీ డీన్ స్టూడెంట్ అఫైర్సు డాక్టర్ డీఆర్.సలోమి సునీత ఆధ్వర్యంలో విద్యార్థులు సదస్సుకు వెళ్లారు. సదస్సుకు హాజరైన విదేశీ విద్యార్థులు, డీఎస్‌ఏ సునీతలు అధిక దిగుబడినిచ్చే వివిధ చిరు ధాన్యాల సాగు విధానాలు, చిరు ధాన్యాల ఆధారిత ఉత్పత్తుల తయారీ తదితర అంశాల గురించి వివరించినట్లు వర్సిటీ అధికారులు సోమవారం తెలిపారు.



ఢిల్లీలో చిరుధాన్యాల సదస్సుకు హాజరైన విద్యార్థులు

రాయకుదురు, నడపనివారిపాలెంలో చోరీ

వీరవాసరం: వీరవాసరం మండలంలోని రాయకుదురు, నడపనవారిపాలెంలో సోమవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తలుపులు , బీరువాలు పగలగొట్టి వాటిలో ఉన్న 12 ట్యాబ్‌లు దొంగలు పట్టుకుని పోయారు. నడపనివారిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలోనూ భారీ చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న తలుపులను, హుండీని పగలగొట్టారు. వెండి శఠగోపం, ఉద్దరిణి, పంచ పాత్రలు, పళ్లెం వంటి వెండి సామన్లతో పాటు హుండీలోని సుమారు రూ.25 వేల నగదును చోరీ చేశారు. సంఘటనా ప్రాంతాన్ని భీమవరం రూరల్ సీఐ సిహెచ్ నాగప్రసాద్ సందర్శించారు. క్లూస్ టీం ప్రత్యేకంగా వివరాలు, వేలిముద్ర నమూనాలు సేకరించారు.



ఆలయంలో చోరీ వివరాలను సేకరిస్తున్న పోలీసులు


క్లుప్తంగా

వశిష్ట లియో క్లబ్ సేవలు అభినందనీయం


లార్డ్స్ ఆఫ్ లైఫ్‌లో సేవా కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్, వశిష్ట లియో క్లబ్ చేస్తున్న సామజిక సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. క్లబ్ వారిచే సోమవారం స్థానిక లార్డ్ ఆఫ్ లైఫ్‌లోని చిన్నారులకు వేగేశ్న లలిత సహకారంతో విద్యార్థులకు భోజనాలు నిమిత్తం 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లియో సభ్యులు మాధురి, ప్రజ్ఞ, బాల శివ, కార్తీక్, శిరీష పాల్గొన్నారు.

విప్పర్రు గ్రామ దేవతల ఉత్సవాలు ప్రారంభం


గ్రామంలో కొలువైన గ్రామ దేవత మహంకాళమ్మ

పెంటపాడు: మండలంలోని పడమరవిప్పర్రు గ్రామంలో నూతన సంవత్సరాది పురస్కరించుకొని గ్రామ దేవతలైన మహంకాళమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఈనెల 20 నుంచి 24 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా యువనేత కొట్టు విశాల్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందరరావు, వైఎస్సార్ పార్టీ సీనియర్ నేత కొనూరి చంటిరాజు, మాజీ సర్పంచ్ చంటి తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గం పరిధిలో ఎనిమిది కేంద్రాల్లో లెక్కలు–1 బోటనీ–1,సివిక్స్–1 పరీక్షలు జరిగాయి. జనరల్, వొకేషనల్ విద్యార్థులు 2,609 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,496 మంది పరీక్షలు రాశారు.113 మంది పరీక్షలకు హాజరు కాలేదు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

వాసవి ఉమాచంద్రశేఖర్ స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో ఉమా చంద్రశేఖర్ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో మాస శివ రాత్రి పురస్కరించుకొని ఉమా చంద్రశేఖర్ స్వామికి సోమవారం పంచామృతాలతో, ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు, విశేష అలంకరణ ప్రత్యేక పూజలు జరిగాయి. ఆర్య వైశ్య సంఘం ట్రెజరర్ నున్న బాల త్రిపుర సుందరరావు, ఆర్యవైశ్యులు పేరూరి కాశయ్య, కె.శ్యామ్, ఎ.కృష్ణకుమార్ తదితరులు పూజలను పర్యవేక్షించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ


గొల్లలకోడేరులో హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

పాలకోడేరు: హెల్మెట్ ధరించడం ద్వారానే ప్రాణాలను రక్షించుకోవచ్చునని జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ అన్నారు. గొల్లలకోడేరు గ్రామంలో వాహనదారులతో హెల్మెట్లను కొనుగోలు చేయించి హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మంచినీటిని ఆదా చేద్దాం

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ మంచినీటిపై అవగాహన కలిగి, నీటిని ఆదా చేయాలని సర్ సీవీ రామన్ పాఠశాల పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శిరీష అన్నారు. శృంగవృక్షం గ్రామంలోని సర్ సీవీ రామన్ పాఠశాల విద్యార్థులు సోమవారం మంచినీటి జలాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఇంకుడు గుంతలతో నీటిని ఆదా చేయాలని, నీటిని వృథా చేయొద్దంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. శిరీష మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నీరు దొరక్క కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, నీటిని పొదుపు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ భాస్కరరావు, సాయిబాబా, సుంకర సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదాలకు ముకుతాడు

- చురుగ్గా డ్రోన్ సర్వే
- పారదర్శకంగా నిర్వహణ


మండలంలో పలు చోట్ల డ్రోన్ సర్వే చేస్తున్న దృశ్యం

పెంటపాడు: మానవుల మనుగడకు భూమి ఎంతో అవసరం. నివాసం ఉండటానికి, పంటలు పండించడానికి, జీవనం సాగించడానికి అత్యంత ముఖ్యం. ఈ నేపథ్యంలో కొన్ని చోట్ల భూమి ఆక్రమణలకు గురవుతోంది. వివాదాల కారణంగా నిరుపయోగంగా ఉండిపోతోంది. దాని కోసం అనేక గొడవలు కూడా జరుగుతున్నాయి. దీంతో రైతులందరికి వారి భూమిపై హక్కు కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా డ్రోన్ సర్వే నిర్వహిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా భూ వివాదాలు దాదాపు పరిష్కారమవుతాయి. తాడేపల్లిగూడెం, తణుకు, నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఈ సర్వే వేగంగా జరుగుతోంది. గూడెం నియోజకవర్గంలోని రెండు మండలాల్లో 72 గ్రామాలు ఉన్నాయి. మొత్తం 5,46,871 హెక్టార్లు విస్తీర్ణంలో మొత్తం భూమి ఉంది. దీంతో పాటు, పంట పొలాలు, తోటలు ఉన్నాయి. అలాగే 72 గ్రామాల్లో ఇళ్ల సర్వే చేయాలి. సుమారు 100 ఏళ్ల క్రితం బ్రిటీష్ సమయంలో భూసర్వే జరిగింది. నాటి నుంచి నేటివరకు సర్వే నిర్వహించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టింది. దీంతో భూ తగాదాలు, న్యాయస్థానాల్లో వివాదాల్లో ఉన్న భూములకు విముక్తి లభించనుంది. కోర్టు వివాదాల కారణంగా ఖాళీగా ఉన్న పొలాలు సాగుకు నోచుకోంటున్నాయి. పంట విస్తీర్ణం పెరుగుతోంది. తద్వారా ఆహారకొరత ఉండదు.

డ్రోన్ సర్వే జరిగేతీరు



డ్రోన్ సర్వే ద్వారా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని గ్రామాల వారీగా నిర్వహిస్తారు. తర్వాత గ్రామాల వారీగా సరిహద్దులు, కిలోమీటర్లు నిర్ధారణ చేస్తారు. సాంకేతిక పరమైన పరిజ్ఞానంతో ఈ సర్వే జరుగుతోంది. డ్రోన్ తీసుకొచ్చిన ఫోటోలు ఇతర వివరాలను జీయో టాకింగ్ చేసి సర్వే ఆఫ్ ఇండియాకు పంపిస్తారు. అక్కడ ప్రోసెస్ చేస్తారు . ఆయా గ్రామాల మ్యాప్‌ల ఆధారంగా ప్రతి రైతు భూమి, ఇంటి స్థలాన్ని విస్తృతంగా సర్వే చేస్తున్నారు.

– జీవీ శేషగిరిరావు, తహసీల్దార్, పెంటపాడు మండలం

సర్వేకు సహకరించాలి



భూ సర్వేకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ సర్వే నిర్వహిస్తారు. పొలాలు, స్థలాలను సర్వే చేస్తాం. ఆ యజమానులు సర్వే సమయంలో హాజరై వివాదాలకు తావులేకుండా సర్వే చేయించుకోవాలి. మండలంలో 28,744.52 ఎకరాల వ్యసాయభూమి, 3,558 ప్రభుత్వ స్థలాలు, 21,949.93 జిరాయతీ భూములు ఉన్నాయి.

– పి. దీప్తి లాస్య, మండల సర్వేయర్, పెంటపాడు

భూ వివాదాలకు చెక్



ఎన్నో ఏళ్లుగా భూములు, ఇళ్లస్థలాల సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయి. సరిహద్దు తగాదాలతో ఇళ్లస్థలాలు, పంట పొలాలు సైతం కోర్టు వివాదాలలో ఉన్నాయి. వివాదాస్పద భూముల పరిష్కారానికి జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ఎంతో దోహదపడుతుంది.

– కైగాల శ్రీనివాస్, జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షులు, ఆకుతీగపాడు

సీఎం జగనన్న ముందుచూపు



ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. భూ వివాదాలకు చెక్ పెడుతున్నారు. భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నం కాకుండా రిసర్వే చేపట్టారు. దాదాపు బ్రిటీష్ హయంలో 100 ఏళ్ల క్రితం ఇలా సర్వే చేశారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

– కట్టుబోయిన కృష్ణప్రసాద్, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు , జట్లపాలెం

వైభవంగా బలుసులమ్మ అమ్మవారి ఊరేగింపు


బలుసులమ్మ అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా సోమవారం సాయంత్రం పట్టణ ఇలువేల్పు బలుసులమ్మ అమ్మవారిని పట్టణ పుర వీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గరగ నృత్యాలతో, డప్పులతో ఊరేగింపు జరిగింది. తొలుత ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అనంతరం అమ్మవారి గరగలను ఆలయ ప్రదక్షిణలు అనంతరం అమ్మవారి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల కోసం ఎనలేని కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఉపముఖ్య మంత్రి కొట్టు సత్యనారాయణలకు అమ్మవారి ఆశీస్సులు తప్పక ఉంటాయన్నారు.బలుసులమ్మ అమ్మవారికి సోమవారం సాలిపేట, పాలబుచ్చియ్య వీధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బలుసులమ్మ వారికి సోమవారం సారే అందజేశారు. వార్డు నుంచి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా మహిళలు తరలివచ్చి పట్టు చీర, చలివిడి పానకాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, వైస్ చైర్మన్ వట్టిపోలు రాము, పెదప్రోలు భాస్కరాచార్యులు, వెలనాటి సత్తిబాబు, మహిళలు, భక్తులు హాజరైయారు.

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌కు అభినందనలు


ఎమ్మెల్సీగా ఎన్నికైన వంకా రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న తణుకు ఎన్‌జీవో సంఘం నాయకులు

తణుకు టౌన్: ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పారిశ్రామికవేత్త వంక రవీంద్రనాథ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. తణుకు రూరల్ మండలం తేతలి ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని తన కార్యాలయంలో రాష్ట మహిళా కమీషన్ సభ్యురాలు బూసి వినీత, పీసీసీ మహిళా కార్యదర్శి అరిగెల అరుణ కుమారి, తణుకు తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కేఎస్‌వీ నరసరాజు, కే సత్యనారాయణ, కోశాదికారి వైవీఎస్‌బి రాయుడు, ఉపాధ్యక్షుడు పీవీ నాగరాజు, సహాయ కార్యదర్శి ఎస్ వెంకట రమణ, ఆర్ శ్రీనివాసరావు, పెవరలి లయన్స్ క్లబ్ నాయకులు, వంకా రవీంద్రనాథ్‌ను కలసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అత్తిలి మండలంలోని దిరిశాల సేవాసమితి అధ్యక్షుడు దిరిశాల మునేశ్వరరావు రవీంద్రనాథ్‌కు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి విద్యార్థులకు రాగిజావ పంపిణీ

అత్తిలి: మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు మంగళవారం నుంచి రాగిజావను అందిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. పార్టీనాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన


డిపో మేనేజరు సత్యనారాయణమూర్తి

తణుకు అర్బన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి అన్నారు. తణుకు డిపోలో సోమవారం ఉదయం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు చేసిన పలు విజ్ఞప్తులు, సలహాలు, ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్నట్లు చెప్పారు. ఇందులోభాగంగా ప్రయాణికుల సూచనల మేరకు కేశవస్వామి గుడి వద్ద బస్ షెల్టర్, పాత బస్టాండ్ సమీపంలోని బస్ షెల్టర్‌ల వద్ద బస్సుల రాకపోకల టైం టేబుల్స్ చేసినట్లు చెప్పారు.

తాడేపల్లిగూడెంలో నేడు ...

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో ఈ నెల 21వ తేదీన మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది ప్రవర్తన, బస్సుల కండిషన్, వివాహాది శుభ కార్యాలయాలకు, విహార, విజ్ఞాన, ఆధ్యాత్మిక యాత్రలకు కావాలసిన బస్సులు తదితర అంశాలపై చర్చించాలన్నారు. ఉదయం 11గంటల నుంచి 12గంటలవరకు నిర్వహించనున్న కార్యక్రమంలో చరవాణి నెంబర్‌కు 99592 25488కు ఫోన్‌చేసి సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి


తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పారావు

తాడేపల్లిగూడెం రూరల్: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ వైకేవీ.అప్పారావు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బాల్య వివాహాల నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వైకేవీ. అప్పారావు మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి నెలల్లో మండలంలో తొమ్మిది బాల్య వివాహాలను అడ్డుకోవడం జరిగిందన్నారు. వారంతా పాఠశాలల్లో చదువుకుంటున్నారని గుర్తు చేశారు. బాల్య వివాహలు నిర్వహిస్తే పెళ్లి చేసుకున్న పెళ్లి కొడుకుపై పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబ సభ్యులు, పురోహితునిపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఏపీఎం జీవీకేడీఎం. లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దోమల పుట్టుకకు నీటి నిల్వలే కారణం

తణుకు అర్బన్: దోమల పుట్టుకకు నీటి నిల్వలే కారణమని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర రావు అన్నారు. కీటకనియంత్రణ, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను నిరోధించవచ్చని తెలిపారు. కీటక నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై సోమవారం స్థానిక 7వ వార్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. స్థానికంగా మురుగుతో నిండి ఉన్న డ్రైయినేజీ తాలూకా వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయించారు. వ్యాధుల నివారణ అవగాహన కల్పించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ మాధవి, హెల్త్ అసిస్టెంట్స్ తాతాజీ, శ్రీనివాస్, ఆశ కార్యకర్త అనురాధ పాల్గొన్నారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం


కమిషనర్ బి బాలస్వామి

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పారిశుధ్య ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రతిభ చూపిన మహిళలకు స్వచ్ఛత అవార్డులు అందుకొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ బి బాలస్వామి సోమవారం తెలిపారు. వ్యక్తిగత స్వయం సహాయక, చిన్నతరహా సామాజిక మరుగుదొడ్లు నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించే పద్ధతులు, చెత్తతో కళాకృతుల తయారీ, చెత్తతో సంపద తయారీ, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, స్వచ్ఛతపై ప్రజలకు అగాహన కల్పించడం, తడిచెత్త వినియోగంతో కంపోస్టు తయారీ తోపాటు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు అందజేస్తారని కమిషనర్ బాలస్వామి వెల్లడించారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 24వ తేదీ లోగా తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న అవార్డులను ప్రధానం చేస్తారన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన


తణుకులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

తణుకు: ఇటీవలి కాలంలో గుండెపోటు కారణంగా పలువురు మృత్యువాత పడుతున్నారని ఈ క్రమంలో ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని 108 అత్యవసర వాహనం ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ దాసరి రాజు పేర్కొన్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎవరైనా అకస్మాత్తుగా గుండెపోటుకు లోనైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీపీఆర్ విధానంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం 108 వాహనంలోని పరికరాలు వినియోగించే విధానంపైనా వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీలు మణిచైతన్య, సతీష్, పైలట్లు జయరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తణుకు టౌన్: కీళ్ల వాతం కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామానికి చెందిన పారిచర్ల పరబ్రహ్మం ప్రసాద్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం తణుకు మానవత సంస్థ రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు తెలిపారు. సోమవారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో రూ. 5 వేల చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి బీ రామలక్ష్మీ, శివనారాయణ, ఆలపాటి సోమేశ్వరరావు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, బీ రామకాశీ తదితరులు పాల్గొన్నారు.

ఫిష్‌ఆంధ్ర అవుట్‌లెట్స్ ఏర్పాటు చేయాలి


సిబ్బందితో మాట్లాతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్) : ఫిష్‌ఆంధ్ర అవుట్‌లెట్స్ ఏర్పాటు త్వరితగతిన చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ల ఏర్పాటుపై సోమవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారులకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ఫిష్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బతికున్న చేపల స్టాల్స్, పెద్ద రెస్టారెంట్లు ఏర్పాటు చేయుటకు సబ్సిడీపై రుణ సదుపాయం పొందవచ్చునని ఆమె అన్నారు. ఇప్పటికే గుర్తించిన ఒక్కొక్కటి రూ. లక్ష విలువగల 214 ఫిష్ అవుట్‌లెట్స్ గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. అదే విధంగా రూ.10 లక్షల విలువైన యూనిట్లు 10 గుర్తించారని, రూ.20 లక్షల యూనిట్లు నాలుగు గుర్తించారని వీటిని త్వరితగతిన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఇన్‌చార్జి జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ ఎం .మురళికృష్ణ, మత్స్య శాఖ ఎఫ్డీఓలు, వీఎఫ్ఏలు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆదేశాలతోనే భౌతిక దాడులు


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలతోనే అసెంబ్లీ సమావేశాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు భౌతిక దాడులకు, వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆరోపించారు. సోమవారం హౌసింగ్ బోర్డు కాలనీలో మాలమహానాయుడు ఆధ్వర్యంలో అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేల దౌర్జన్యాన్ని సోమవారం ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై అమానుషంగా వ్యవహరించిన టీడీపీ ఎమ్మెల్యేలను చట్టసభల్లోకి అడుగుపెట్టకుండా నిషేధించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంగరాజు కోరారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మంగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో తాడేపల్లి ప్రేమకుమార్, యు.ఏసురత్నం, గోపి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

తాడేపల్లిగూడెం అర్బన్ : రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తున్న పెంటపాడు మండలం దర్శిపర్రుకు చెందిన పరిమళ్ల శ్రీనివాసును పట్టణంలోని కోతిబొమ్మ సెంటరువద్ద పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి తొమ్మిది క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం బస్తాలను తరలిస్తున్న ఎపి 37 టిడి 1522 ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై బి రాజు సోమవారం తెలిపారు. గతంలో పలుమార్లు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న నేపథ్యంలో శ్రీనివాస్ పై పలు కేసులు ఉన్నట్లు ఎస్సై బి రాజు చెప్పారు.

పాస్‌పోర్టు పోయినది

కూనపరెడ్డి రమాదేవి W/o సత్యనారాయణ అను నేను నా పాస్‌పోర్టు 05.03.2023న ఇల్లు మారుతుండగా పాస్‌పోర్ట్ నెం.(B6942925) మార్గ మధ్యలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబర్‌కి తెలియజేయకోరుచున్నాము. సంప్రదించండి : 81068 70182

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం


కబడ్డీ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

వీరవాసరం: ఉగాది సందర్భంగా కొణితివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొణితివాడ యూత్ కబడ్డీ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. సీనియర్ కబడ్డీ ప్లేయర్ నాగరాజు భాస్కర్ రాజు చేతుల మీదుగా కబడ్డీ మూడురోజుల పోటీలను ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.20,000, ద్వితీయ బహుమతి రూ.12,500, తృతీయ బహుమతి రూ.7500, కన్సొలేషన్ బహుమతితో పాటు బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెన్స్, బెస్ట్ ప్లేయర్లకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. మొదటగా ఆచంట – బల్లిపాడు జట్ల మధ్య, భీమవరం – వాడపల్లి జట్ల మధ్య, తాడేపల్లిగూడెం – జువ్వలపాలెం టీముల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ప్రారంభ కార్యక్రమంలో ఉండ్రాజవరం తహసీల్దార్ ఎ.కనక రాజు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, యరకరాజు చినబాబు, నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, హరిబాబు, యరకరాజు పెదబాబు, బొశెట్టి కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్, వరప్రసాద్, ప్రసన్న యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చుకలను సంరక్షించుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందిజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక పీఎస్ఎమ్ గరల్స్ హైస్కూల్లో సోమవారం నిర్వహించారు. పిచ్చుకల సంరక్షణపై అవగాహన కల్పించారు. వ్యాసరచన, వకృత్వ పోటీలు జరిపారు. హెచ్ఎం జె సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి హస్ముఖ లాల్ జైన్ మాట్లాడుతూ కనుమరుగైపోతున్న పిచ్చుకలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు అల్లు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వారణాసి రాధాకృష్ణ, శ్రీదేవి, మాధవి లత, ఇందుకూరి శివాజీవర్మ పాల్గొన్నారు.

గొల్లలకోడేరులో ఫ్యామిలీ డాక్టర్

పాలకోడేరు: నెలకు రెండుసార్లు నిర్వహించే ఫ్యామిలీ ఫిజిషన్ క్యాంప్‌ను సద్వినియోగపరచుకోవాలని పాలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ రంగం నాయుడు అన్నారు. గొల్లలకోడేరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. మధుమేహ రోగులను హైపర్ టెన్షన్‌కు గురైన వ్యక్తులను పరీక్షించి మందుల అందించారు. రోగులకు హెల్త్ ఎడ్యుకేషన్ నిర్వహించారు. సమయానికి పోషకాహారం తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీహెచ్ఓ సత్యనారాయణ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.